కథానిక:

# బరువెక్కిన గుండె

శ్రీ సోమవేదం జానకిరామశర్మ

"నిజంగా మీ అయ్యగారి నెఱుగుదును నేను."

"పోవయ్యా! కబుర్లు."

"కబుర్లు కాదు. ఒక్కసారి ఆయన దర్శనం చేయనియ్యి. ఆయనతో ఒక్కసారి మాట్లాడనియ్యి. నీకు పుణ్యం వస్తుంది."

"మంచిగా చెపితే మనుషులకు తెలియదు. అయ్యగారి నీ సమయంలో చూడ్డానికి వీల్లేదయ్యా అంటే సైతాన్లాగు తగులుకున్నావేం? ముందు మెట్లుదిగి మాట్లాడు."

"ఆయన వస్తుంటే అప్పుడే పోతాగా_"

"నే వద్దంటే పోగూడదా ఏమిటి? ఈ మాత్రానికి అయ్యగారు కూడా చెప్పాలా? పోవయ్యా - ఈపాటికి."

"చూడు. నువ్వు పొమ్మంటే కూడా పోవల్సిందే... కాని ___"

"మళ్లీ - కాని... అంటాడు!"

"నువ్వు మంచివాడివి కనక అయ్యగారి కష్టసుఖాలు కనిపెడుతున్నావు. కొందఱు పసువుల్లాగ మంచీ చెడ్డా తెలియక ఇష్టం వచ్చినట్లు చేస్తారు. ఇప్పుడు నువ్వు నన్ను లోపలికి వెళ్ళనియ్యటం లేదంటే నామనస్సులో ఓపక్క నిన్ను గురించి మెచ్చుగుంటూ నేవున్నా. ఐనా. ఇంత తెలివితేటలు కలవాడివి కాస్త నేనుచెప్పేది ఎందుకని వినటం లేదా అని ఆలోచిస్తున్నాను... అయ్యగార్ని చూడ్డానికి అస్తమానం అనేకమంది వస్తూవుంటారు. ఎవర్ని రానియ్యాలో ఎవర్ని రానియ్యగూడదో తెలియకపోతే ఇన్నాళ్ళనుంచీ ఎల్లా వుద్యోగం చేస్తున్నావ్! ఆమాత్రం నాకు తెలియదంటావా! అసలు అయ్యగారి దర్జా, గౌరవం అంతా నీ మీదే ఆధారపడి వుందనుకో!"

"తెలిసిన మారాజులకి మా కష్టం తెలుస్తుంది."

"ఎవరికో తెలివి తక్కువదద్దమ్మలకి తెలియదు గాని అందరికీ తెలుస్తుంది...... అయ్యగారితో ఒక్కసారి నన్ను మాట్లాడ్నియ్యి!"

"చీకటి పడింది. ఇప్పుడు వీల్లేదు. రేపొస్తే ముందుగా వెళ్లి నేనే చెప్పి అయ్యగారి దర్శనం చేయిస్తా"

"అభ్యంతర మేమిటి. రేపెల్లాగూ నీవా పని చేయగలవు. కాని... ఒకమాట ఈరాత్రి మాట్లాడనిచ్చావంటే నీకెంతైనా పుణ్యం వుంటుంది. చూడు.... నీ సాయం నే నూరికే పోనియ్యను."

"నాకామాత్రం తెలవదూ! ఐనా లోపలికి వెళ్లొస్తా నుండండి."

ఇట్లా చెప్పి బంట్రోతు సూరయ్య లోపలికి వెళ్లాడు. వెంటనే లోపల్నించి బయటకువచ్చి—

"అయ్యగారికి తలనొప్పిగా వుందిటండీ!"

"అల్లాగా... పోనీ తే నువ్వేం జేస్తావ్. నా అదృష్టంకూడా కలిసిరావాలి."

"బాబూ! అయ్యగార్ని బాగా ఎఱుగున్నారా?"

"ఎఱిగుండడం ఏమిటి? ఇద్దరం ఒకటేననుకో..."

"ఐతే రేపుప్రొద్దున్న రండి......కాఫీకేమైనా.."

బంట్రోతు కాఫీకి డబ్బులడిగేటప్పటికి కృష్ణమూర్తి జేబులో చెయిపెట్టాడు. కానీ కూడా లేదు. తెల్లబోయిన మొహంతో కృష్ణమూర్తి...

"కానీ కూడా లేదయ్యా ..."

"పోనీలెండి. రేపు తేవచ్చు."

బంట్రోతు రేపు తేవచ్చుననగానే కృష్ణమూర్తి మనసులో ఆలోచన బయలుదేరింది. రేపుమాత్రం డబ్బులు ఎట్లా తేగలడు? తేకపోతే రేపు బంట్రోతును ఎలా చూడడం? ఒక్కసారిగా అనేక ఆలోచనలు మనస్సులోకి వచ్చినై. తన పూర్వస్థితి అంతా జ్ఞాపకం వచ్చింది. మొగం పక్కకు తిప్పి—

"రేపైనా తెస్తానని నీకు వాగ్దానం చెయ్యలేను. ఏమంటే......"

...ఇలా అని కృష్ణమూర్తిపైన మాట్లాడలేదు. బంట్రోతు సూరయ్య అప్పుడే చుట్టకాల్చేందుకు అగ్గిపెట్టె తీసి పుల్ల వెలిగించాడు. ఆ నిప్పు పుల్లవెలుతురులో కృష్ణమూర్తి మొగం బాగా కనిపించింది. గడ్డం బాగా పెరిగివుంది. కళ్లు పెద్దవి. ఆ నిప్పు పుల్లకాంతిలో జిగేలుమని ప్రకాశించినై. కళ్లు చెమ్మగిల్లినట్లుకూడా అనిపించింది. సూరయ్య అతన్ని చూసి—

"పోనీలెండి. డబ్బులివ్వకుండా ఎంతమందికి అయ్యగారి దర్శనం యిప్పించడంలేదు. రేపు తొమ్మిది గంటలకల్లా రండి."

"నీపేరేమయ్యా?"

"నాపేరు సూరన్నండి."

"చూడు, సూరన్నా! రాత్రికి ఈఅరుగు మీద పడుకోనా? అభ్యంతరం ఏమైనా వుంటుందా?"

"అమ్మో! వద్దు బాబూ! వూరు చూడబోతే బాగుండలేదు. ఈ కమ్యూనిస్టోళ్లు... మంచీ చెడ్డా లేదు. ఎవర్నిపడితే వాళ్లని... ఉత్తిపుణ్యానికి చంపేస్తున్నారు బాబూ! మీరు ఎక్కడికైనా వెళ్లి ఈ రాత్రికి పడుకోండి. రేపు తొమ్మిదింటికల్లా రండి."

"కమ్యూనిస్టులు అంతపని చేస్తున్నారా?"

"అంత పనా? వాళ్లుచెయ్యని దురాగతం ఏముంది బాబూ! ఆడ, మగ తేడా లేదు. డబ్బుకు డబ్బు- ప్రాణానికి ప్రాణాలు తీసేస్తున్నారు. వాళ్లకే మొస్తుందో తెలియదు."

"వాళ్లంత చెడ్డవాళ్లా సూరన్నా?"

"ఆ గొడవ మనకెందుకు బాబూ! మందేవూరు?"

"మాది కృష్ణాజిల్లా. మీ అయ్యగారిదీ మాదీ ఒకేవూరు. మే మిద్దరం చిన్నప్పటి నుంచీ కలిసిచదువుకున్నాం. చాలా స్నేహంగా వుండేవాళ్లం. స్నేహమంటే - ఓకంచంలో తిని ఓ మంచంమీద పడుకునేవాళ్లం."

"ఐతే మా అయ్యగారిలాగా మీరూ గొప్పచదువు చదివేరన్నమాట! మొదట్లోనే చెప్పెయ్యకపోయినారా బాబూ! అయ్యగారితో చెప్పేవాణ్ణి. ఇప్పుడు తలుపు కూడా వేసుకున్నారు. ఐనా మళ్లీ పిలవమంటారా?"

"ఒద్దు, ఒద్దు. రేపు రమ్మన్నావుగా"

"బాబూ! మనపేరు?"

"నాపేరు కృష్ణమూర్తి."


కుష్టు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టరు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

ఇలా చెప్పి కృష్ణమూర్తి వెంటనే అరుగుదిగి వెళ్లబోతూ "సూరన్నా! రేపు తొమ్మిదిగంటలకు వస్తాను సుమా!" అన్నాడు. ఆ మాటకు సూరన్న "తప్పక రండ"ని సమాధాన మిచ్చాడు. ఒక నిమిషంలో కృష్ణమూర్తి వెళ్లినతరువాత సూరన్న బైట వసారాగదిలోకి పోయి పడుకున్నాడు.

మోహనరావు హైదరాబాదులో స్పెషల్ జడ్జీగా నియమింపబడ్డ రెండేళ్లనుంచీ సూరన్న వారిదగ్గరే వుంటున్నాడు. మోహనరావు కృష్ణమూర్తి ఎలిమెంటరీ స్కూలుచదువు. మొదలు కాలేజీవిద్య అయ్యేదాకా సహాధ్యాయులుగా వున్నారు. కృష్ణమూర్తి బి. ఎ. ఐనాక ఇంటిదగ్గర వ్యవసాయంపనులు చేసుకుంటూ వుండిపోయినాడు. మోహనరావు బి. యల్ పరీక్ష ప్యాసయి కొన్నాళ్లు బందరులోనూ, కొన్నాళ్లు బెజవాడలోనూ ప్రాక్టీసుచేశాడు. తరవాత కొన్నాళ్లకు ప్రభుత్వంవారిచే మునిసిఫ్‌గా నియమింపబడ్డాడు. క్రమంగా ఆయన ఆవృత్తిలో మంచిపేరు సంపాదించుకొన్నాడు. తత్ఫలితంగా ప్రభుత్వం ఆయనను ఇటీవలనే హైదరాబాదులో స్పెషల్‌జడ్జీగా నియమించింది.

మర్నాడురాత్రి తొమ్మిదిగంటలు దాటింది. మోహనరావు గోపాలరావు భోజనంచేసి ముందు వరండాలో వున్న కుర్చీల్లో కూచున్నారు. కొంచెంసేపైన తరువాత సుశీల తమలపాకులు వక్కలు వగైరా తీసుకుని అక్కడేవున్న చాపమీద కూర్చుంది. సుశీలను చూడ్డంతోనే మోహనరావు—

"కృష్ణమూర్తి బలే నాటకం ఆడాడు సుమీ"

"నాటకం ఏముందీ - ఏదో పనిమీద తిరుగుతూ వుంటాడు"

"వండిన వన్నీ నువ్వే తిన్నావా?"

"రాత్రికి వస్తాడేమో ననుకుంటూన్నాను"

సుశీల ఇలా అంటూవుండగానే కృష్ణమూర్తి తన కూతురు సుధను తీసుకొని వీధి గుమ్మం దాటి ఇంట్లోకి వస్తున్నాడు. మోహనరావుగాని, సుశీలగానికృష్ణమూర్తిని గుర్తుపట్టలేదు. సరాసరి కృష్ణమూర్తి వరండాదగ్గరకు వచ్చాడు. వెనక సుధ నిలబడి వుంది. సుశీల ఎవరో వచ్చారని చాపమీదనుంచి లేచి నిలబడింది. వెనకాలే సూరన్న వచ్చి "అమ్మా! కృష్ణమూర్తిగారే నండి. అమ్మాయిగారిని తీసుకొచ్చారు" అన్నాడు. ఆమాట విని సుశీల వచ్చిన వ్యక్తిని నిదానించి చూసి

"ఎవరూ? కృష్ణమూర్తా?" అంది. గడప ఎక్కుతూ కృష్ణమూర్తి

"అక్కా మఱచిపోయినావా?"



"ఇదేమిటి? కృష్ణమూర్తి! ఇలాతయారైనావు" అంది.

మోహనరావు కృష్ణమూర్తిని పోల్చుకొన్నాడు. "కృష్ణా! ఏమిటి వేషం?" అన్నాడు.

కృష్ణమూర్తి తన కూతురు సుధతో "అమ్మాయీ అత్తదగ్గర కూర్చో" అన్నాడు. సుధ సుశీలదగ్గరకు వచ్చింది. కృష్ణమూర్తి మోహనరావుదగ్గరగా వున్న పడకకుర్చీలో కూచున్నాడు. మోహనరావు కృష్ణమూర్తితో

"కృష్ణా! ఏమిరా యీ వేషం" అన్నాడు. కృష్ణమూర్తి ఒరే వేషంలో ఏముంది? ఈమధ్య చాలా జబ్బుపడ్డాను. అందుచేత గడ్డం బాగా కులాసా చిక్కేదాకా తీయించనని వేంకటేశ్వరస్వామికి మొక్కుకున్నాను." అన్నాడు.

సూరన్న ఇంతలో దొడ్లో నూతిలోంచి నీళ్లు తోడి తెచ్చాడు. కృష్ణమూర్తి లేచి కాళ్లు కడుక్కున్నాడు. సుశీల, అమ్మాయీ! నీవుకూడా కాళ్లు కడుక్కో అమ్మా! అని సుధను చూస్తూ అన్నది. సుధ లేచి కాళ్లు కడుక్కుంది.

ఒకప్పుడు కృష్ణమూర్తి ఎప్పుడూ తల, బట్ట మాయనీయకుండా అప్పుడే పూసిన పువ్వల్లే వుండేవాడు. మనస్సు కూడా దానికి తగినట్టు చాలా సున్నితంగా వుండేది. పూట పూటకు దుస్తులు మారుస్తూ వుండేవాడు. ఇప్పుడు పోలిక పట్టలేకుండా తయారైనాడు. తొడుక్కున్న చొక్కా మూడుచోట్ల చిరిగింది. పదేళ్లక్రిందట కృష్ణమూర్తికి ఇంత శరీరం వుండేది కాదు. కొంచెం పల్చగా వుండి, పెద్ద పెద్ద కళ్లు, సూదిముక్కుతో బంగారు ఛాయతో అందర్నీ ఆకర్షించేవాడు. ఆనాటి రూపంలోనే కృష్ణమూర్తిని, మోహనరావు, సుశీల ఇప్పుడు కూడా చూస్తామనుకున్నారు. ఇప్పుడు మనిషి మోటుగా వున్నాడు. శరీరచ్ఛాయ బాగా తగ్గింది. శరీరం లావెక్కింది. నాజూకుతనం పోయింది.

రెండు నిముషాలసేపు అయినతరువాత మోహనరావు "కృష్ణా! ఈ అమ్మాయి నీకుమార్తెనా? అన్నాడు.

"అవును మా అమ్మాయే. ఒకటే పిల్ల. దీని పేరు సుధ"

ఆ మాటపైన సుశీల అందుకొని "అవును దీని బారసాలకే మేము బెజవాడలో వుండగా రమ్మని వుత్తరంకూడా వ్రాశావు" అంది. ఆమాటపైన "సరే కాని లోపలకు తీసుకువెళ్లి వీళ్లకు ముందు అన్నం పెట్టు. వంటమనిషికూడా వెళ్లిపోయినట్లుంది" అని మోహనరావు అన్నాడు. దానిమీద కృష్ణమూర్తి—

"నేను ఇప్పుడు భోజనం చెయ్యను. చాలా మందిమి మనవూరినుంచి బొంబాయి పోతున్నాము. మా అమ్మాయి హైదరాబాదు చూడలేదంటే చూపిద్దామని తీసుకు వచ్చాను. నాలుగురోజుల్లో తిరిగి బొంబాయినుంచి వచ్చేటప్పుడు ఇక్కడ ఆగి మా అమ్మాయిని తీసుకు వెడతాను." అన్నాడు. ఆమాటలు విని మోహనరావు—

"భోంచెయ్యకుండా వెళ్లడమేమిటి?"

"ఫరవాలేదు. ఆకలిగా లేదు. రాత్రి $11\frac{1}{2}$ గంటలకు ఇక్కడనుంచి బయలుదేరబండికే అంతా పోతున్నాము. నేను కూడా ఇప్పుడే పోతాను. విశేషాలన్నీ నేను తిరిగి వచ్చాక మాట్లాడుకుందాం."

"నీ భార్య నిర్మల కులాసాగా వుందా?"

"కులాసా కెక్కడికి ?. ఏదో వున్నాం. అంతా అమ్మాయి చెపుతుంది. అక్కా! ఆ కూర్చుంది మీ గోపాలమేనా? "

"సరే! మావాడే - వీడికీ మీ అమ్మాయికీ ఐదేళ్లు వార అనుకుంటాను"

"ఔను! అల్లుడూ! పోయివస్తానోయ్! మోహన్! మళ్లీ వస్తానురా!"

"అరే! ఏం చెప్పల్లో ప్రయాణమేమిటిరా ?"



"ఏమీ లేదు. వాళ్లని మళ్లీ చిక్కుల పెట్టినట్లవుతుంది. మళ్లీ నీకు కనబడతాగా... మరి. సరే నను. అక్కా! నీవైన వెళ్లి రమ్మను."

"కృష్ణమూర్తీ! భోం చెయ్యకుండా వెళ్లడం బాగా లేదు. "మళ్ళీ వస్తానంటి నిగా.... అక్కా!"

ఈమాట విని మోహనరావు—

"సరే! పో, టైము కావచ్చింది. తప్పకుండా కనపడు."

"కనపడక మా అమ్మాయిని మీ ఇంట్లో నే వుంచుతానేమో!"

ఇట్లా అంటూనే కృష్ణమూర్తి బయటకు బయల్దేరాడు. వెడుతూ కుమార్తెతో. "అమ్మా! సిగ్గుపడక మన ఇంట్లోలాగా నే వుండు. త్వరగా వస్తాలే" అన్నాడు. మోహనరావు, సుశీల బయట గుమ్మందాకా వచ్చి కృష్ణమూర్తిని సాగనంపారు.

సుశీల సుధను భోజనం చేయించటానికి ఇంట్లోకి తీసుకు వెళ్లింది.

* * *

నాలుగురోజుల్లో వస్తానన్న కృష్ణమూర్తి బొంబాయినుంచి నెలరోజులైనా రాలేదు. సుధ ఏపూటకాపూట తండ్రికోసం ఎదురు చూస్తోంది. ఏమాత్రం పరిచయం లేని ఆ ఇంట్లో సుధ మొదటిరోజుల్లో వుండటానికి కష్టపడింది. కాని సుశీల, మోహనరావు తన మీద చూపిస్తున్న ప్రేమవల్ల కొంత మనస్సు నిబ్బరంగా వుంచుకుంది. గోపాలరావు ఆ యింట్లో ఒక్కడే వుండటానికి సెలవుల్లో ఎప్పుడు వచ్చినా చిరాకుపడేవాడు. ఇప్పుడు సుధకూడా వుండటం అతనికి చాలా సంతోషంగా వుంది. సుధ గదిలో కూర్చుంటే గదిలోకి, వసారాలో వుంటే వసారాలోకి, ఏదో పని పెట్టుకుని వస్తూ వుండేవాడు. ఆమె నవయౌవనం అందం అతన్ని యిబ్బంది పెట్టినై. స్వగ్రామంనుంచి వచ్చినప్పటికంటె సుధ ఈ నెలరోజుల్లోనూ చాలా మారిపోయింది. అప్పటికంటె ఆమెలో సౌకుమార్యం ఎక్కువైంది. గోపాలరావుకు ఎప్పుడూ సుధను చూస్తూ కూచోవాలనిపించేది. మొదటిరోజుల్లో సుధ గోపాలరావంటే బెరుకు బెరుకుగా వున్నా రోజులు గడచిన కొద్దీ అతని దర్శనం ఆమెకు ఆనందం కలిగించసాగింది.

ఒకరోజున సుశీల, కాఫీ గదిలో వున్న గోపాలరావుకు సుధ చేత పంపించింది. గోపాలరావు అప్పుడు ఏదో మంచంమీద పడుకుని చదువుకుంటున్నాడు. గుమ్మం దగ్గర చప్పుడు కావడంతోటే తలెత్తి చూశాడు. సుధ నెమ్మదిగా గాజుగ్లాసుతో కాఫీ తీసుకురావటం చూశాడు. చూడనట్టుగా మళ్లీ తన దృష్టి పుస్తకంవేపు మళ్లించాడు సుధ అతనిదగ్గరగా వెళ్లి—

"కాఫీ ఇదిగోనండి"

"..........."

"ఏమండీ! కాఫీ పంపించారండీ!"

"........"

"అత్తయ్యగారు మీకు కాఫీ పంపించారండీ"

"ఏమిటే! అత్తగారా? నాకా! కాఫీ పంపారా? మరి - నీవు - నేనంటే సిగ్గులేకుండా, తెచ్చావే!"

ఇలా అంటూనే గోపాలరావు ఆమె చేతిలో కాఫీగ్లాసు అందుకున్నాడు. వెంటనే సుధ వెళ్లిపోబోయింది. గోపాలరావు ...

"ఉండు, కాఫీ తాగేదాకా వుండి గ్లాసు తీసుకువెళ్లు." అన్నాడు. ఆమె అల్లాగే గోడవేపుకు తిరిగి గ్లాసుకోసం నిరీక్షిస్తూ వుంది. గోపాలరావు ఎంతో వేడిగా వున్నట్లుగా కాఫీ ఆర్పుకు ఆర్పుకు తాగాడు. "ఇదుగో గ్లాసు" అని చెయ్యి చాచాడు. సుధ దగ్గరకు వచ్చి గ్లాసు అందుకోబోయింది. గోపాలరావు కుడిచేత్తో ఆమె బుగ్గమీద చిటికె వేశాడు. సుధ చిఱునవ్వుతో అతనికేసి చూస్తూ వంటఇంట్లోకి పోయింది.

కృష్ణమూర్తి బొంబాయి వెళ్లి నాలుగు మాసాలయింది. ఇంతవరకు జాడ లేదు. ఫలానా అప్పుడు వస్తానని గాని ఫలానా చోట వున్నానని గాని వుత్తరంకూడా వ్రాయ లేదు. సుధ వాళ్లింట్లో చనువుగా తిరగడం మొదలుపెట్టింది. గోపాలరావు, సుధ అప్పుడప్పుడు ఎవరూ లేకుండా కలిసి మాట్లాడుకోటం - సుశీలా, మోహనరావులు కనిపెడుతూనే వున్నారు. సుశీల వాళ్లిద్దరూ హద్దు మీరకుండా వుండేలాగు కనిపెడుతూనే వుంది. సుధమనసులో తన కక్కడ కలుగుతూవున్న నూతనానుభవానికి ఆనందం, భయంకూడా పొందుతోంది.

ఒకరోజు రాత్రి అందరూ భోజనాలు చేసి తాంబూలాలు వేసుకున్నారు. సుశీల దగ్గరగా సుధ కూచుని వుంది. గోపాలరావు తండ్రికి ఎదురుగా కుర్చీలో కూర్చుని వున్నాడు. సుశీల సుధతో—

"అమ్మాయీ! మీ నాన్న దగ్గిర్నుంచి వుత్తరమే రాలేదే"

"నాకేమిటో భయం వేస్తోందత్తా!"

"ఏం భయం-వుత్తరం తీరిక లేక వ్రాయలేదో—వ్రాస్తే వుత్తరమే అందలేదో—

'ఆ మాటపైన మోహనరావు—

"వాడు చిన్నప్పటినుంచి చెప్పేదొకటీ చేసే దొకటీను." అన్నాడు. అది విని సుశీల—

"మీ అమ్మ నిర్మలైనా నీకోసం జాబు వ్రాయలేదే! చిన్నప్పుడు మనవూళ్లో ఎంతో సంతోషంతో ఇద్దరం కలిసిమెలిసి వుండే వాళ్లం." అంది. అది విని గోపాలరావు—

"అమ్మా! ఆ మాటలన్నీ ఎందుకు ఇప్పుడు?"

"ఎందు కేమిటిరోయి—నిర్మలా నేనూ ఎంత స్నేహంగా వుండేవాళ్ళం - నేను కాపరానికి వెళ్లిన కొత్తలో. చాలా కలుపుగోలైన మనిషి." సుశీల పలికిన ఈ మాటలు విని మోహనరావు—

"ఒరే! గోపీ! నాకూ కృష్ణమూర్తికీ ఎంత స్నేహమో మీ అమ్మకూ, నిర్మలకూ అంత స్నేహం వుండేదిరా!"

మోహనరావు ఈ మాటలు అన్న తరువాత సుధ తలవంచుకుంది. కళ్ళనుంచి రెండు మూడు బిందువులు కిందకు రాలినై. అది గోపాలరావొక్కడే చూశాడు. వెంటనే—

"అమ్మా! మీ మాటలకు సుధ ఏం చేస్తోందో చూశావా?"

"ఏం? ఏం చేస్తోంది?"

సుశీల సుధకేసి చూసింది. సుధ పొంగి వచ్చే దుఃఖం ఆపుకోలేకపోయింది. వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. మోహనరావూ, సుశీలా ఒక్కసారిగా—

"ఏడవకు తల్లీ! ఎందుకు ఏడుస్తావు?" అన్నారు. గోపాలరావు అందుకుని—

"నేను చెపితే విన్నావా అమ్మా! సుధను ఏడిపించేదాకా చేశావు"

"నే నేం చేశానురా నాయనా?"

"సుధతల్లి విషయం, మాట్లాడవద్దంటే విన్నావా అమ్మా?"

"ఏం నాయనా? నాకేం తెలుసురా!"

"నీ కేం తెలియదు కనుకనే వద్దన్నాను."

గోపాలరావుమాటపైన మోహనరావు "నిర్మల ఏమైందిరా? సుధ ఏడుపు ఎందుకు? నీకు తెలుస్తే చెప్పు!"

(48-వ పేజీ చూడండి)


## నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.

# బరువెక్కిన గుండె

(18-వ పేజీ తరువాయి)

మోహనరావుమాటలు విని సుధ మరీ వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. సుశీల, మోహనరావు కూడా కారణం తెలియక ఆదుర్దాగా వున్నారు. ఐదునిముషాలైన తరువాత సుశీల—

"సుధా! ఎందుకమ్మా ఏడుస్తావు? చెప్పు." అన్నది. మోహనరావు కూడా-

"మీ అత్తతో చెప్పటానికి జంకుతావేమమ్మా చెప్పు మీ అమ్మ......"

మోహనరావుమాట విని సుధ కంపిత స్వరంతో—

"మా అమ్మ.... మా అమ్మ వుంటే నేనెందు కిక్కడ వుంటాను..."

"ఏమైంది? చనిపోయిందా?"

"అవును... అయ్యో..."

సుధ నోటివెంట నిర్మల చనిపోయిందనే మాట విని సుశీల దుఃఖంతో—

"అయ్యో! మీ అమ్మ... చనిపోయిందా? పాపం. ఏం జబ్బు?"

"ఏమీ జబ్బులేదు... మా నాన్న చేసిన ఘనకార్యం..."

"మీనాన్నే... నిర్మలని చంపింది?"

"కేవలం మానాన్నే కాదు-పోలీసులు-"

"పోలీసులా? పోలీసుల కేం పని?"

"ఒక రోజున మా నాన్న కోసం - పోలీసులు మా యింటికి వచ్చారు-"

ఈ మాటలు సుధ చెపుతూవుండగానే మోహనరావు ఉలిక్కిపడి—

"మీ నాన్న కమ్యూనిస్టులో చేరాడా?"

"అదే మాకువచ్చిబాధ - మా నాన్న మూడేళ్లనుంచీ కమ్యూనిస్టు పార్టీతో సంబంధం పెట్టుకున్నాడు. పార్టీలో పెద్ద లీడరు. అబ్బ - వినగూడదు - చెప్పకూడదు కాని- ఆయన ఎన్ని హత్యలు - ఎన్ని దోపిళ్లు..."

ఇలా అని సుధ కంపించిపోయింది. సుశీల నిశ్చేష్టురాలైంది - మోహనరావు సుధ కేసి చురచుర చూస్తూ—

"అవును. అతడికోసం మీ యింటికి పోలీసులు వచ్చారు గాబోలు-"

"అవును. మా నాన్న కోసం మాయింటికి పోలీసులు వచ్చారు. ఆయన పోలీసులు రావటం కనిపెట్టి తలుపుచాటున దాక్కున్నాడు. పోలీసులు మా నాన్న తలుపుచాటున వున్నట్లు తెలుసుకొని పిస్తోలు పేల్చబోయారు. సరిగా ఆసమయానికే మా అమ్మ మా నాన్న ముందుకు ఆ దెబ్బ తప్పించటానికి వచ్చింది... దురదృష్టవశాత్తూ దెబ్బఅడ్డంవచ్చిన మాఅమ్మకు తగిలింది... ఇంకే ముంది అప్పుడే మాఅమ్మ నేలమీద కూలింది... పోలీసులు మాఅమ్మ చనిపోయిందని విచారంతో ఆమెనులేవదీస్తుంటే మా నాన్న నెమ్మదిగా గోడదాటి వీధిలోపడి తప్పించుకుపోయాడు. మొదటి నుంచీ నేనూ మా అమ్మా కమ్యూనిస్టు పార్టీ సంబంధం వద్దని చెప్పతూనే వున్నాం. మా పొలం, ఇల్లు అంతా అమ్మి పార్టీకోసం ఖర్చుపెట్టేశాడు..."

ఇలా అని సుధ బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టింది. నిదానంగా వింటున్న మోహనరావు ఒక దీర్ఘనిశ్వాసం వదిలాడు. సుశీలకళ్ళవెంట నీళ్లు కారుతున్నయి. గోపాలరావు తండ్రికేసి చూస్తున్నాడు. కొంచెంసేపు అంతా మాట్లాడకుండా వూరుకున్నారు - మోహనరావు నెమ్మదిగా సుధతో - ఆలోచనతో—

"సుధా! నువ్వు కమ్యూనిస్టు లీడరు కూతురవన్న మాట - అవునా?"

"అవును...నాకు కమ్యూనిస్టుపార్టీతో సంబంధం లేదు."

"అలాగా— మీనాయన ద్రోహి. మీ కుటుంబం నాశనంచేసింది కాక మా యింట్లో కూడా నిప్పుపెట్ట దలచుకున్నాడు. కనుకనే నిన్ను తీసుకువచ్చి ఇక్కడ వదలిపెట్టాడు."

గోపాలరావు తండ్రిమాట కడ్డంవచ్చి—

"సుధ ఏం చేస్తుంది నాన్నగారూ?"

ఇందులో నీ విషయం లేదు. హంతకులైన కమ్యూనిస్టులను - కమ్యూనిస్టుల బంధువులను—సంబంధీకులను ఎవరినైనా సరే దయ తలచరాదు - ఇదుగో నేను చెపుతున్నాను. రేపు సాయంత్రంలోగా మాయింట్లోనుంచి నువ్వు—"

సుశీల మోహనరావు పూర్తిగా మాట్లాడకపూర్వమే అందుకొని—

"మీరు సుధనుకూడా అనుమానిస్తున్నారా?"

"మీకు వ్యవహారం ముందు వెనుకలు తెలియవు. గోపీ! నువ్వూ మీ అమ్మా కూడా నా మాటకు అడ్డుచెప్పకండి... బాగా ఆలోచించండి......"

ఇట్లా చెప్పి మోహనరావు చరాలున లేచి గదిలోకి పోయి పడుకున్నాడు.

సుశీలా, సుధ ఇంట్లోకి పోయినారు. గోపాలరావు బైట గదిలో పడుకున్నాడు.

ఆ రాత్రి ఇంట్లో ఎవ్వరూ కూడా నిద్ర పోలేదు. ఎల్లాగో తెల్లవారింది. ఎవరి పనులు వారు ఎట్లాగో చేసుకుంటున్నారు. పదకొండు గంటలకు సగం భోజనంచేసి కలత చెందే మనస్సుతో మోహనరావు కోర్టుకు వెళ్లేడు. మోహనరావు మనస్సులో పెద్ద తుపాను బయలుదేరింది. కృష్ణమూర్తి తన బాల్యస్నేహితుడు. తప్పుడు త్రోవలో పడ్డాడు. సుధ అతని కుమార్తె. ఆయన ఆశయాలకు కేవలం వ్యతిరేకంగా నడిచేది. తల్లిలేని పిల్ల. ఆమెను తన ఇంట్లో వుంచితే ప్రభుత్వానికి అపచారం చేసినట్లవుతుందేమో! ఆశ్రయమీయవలసినదని తన యింట్లో తనపైన నమ్మకంకొద్దీ విడిచిన అనాధబాలికను ఇంట్లోంచి వెళ్ళగొడితే భగవంతుని దృష్టిలో అపచారం చేసినట్లవుతుందేమో- ఈ విధంగా ద్వైధీభావంతో, బరువెక్కిన గుండెతో, మోహనరావు కోర్టులో తన ఆసనంమీద కూర్చున్నాడు.

ఆయన కూర్చోవటంతోటే - తెలంగాణాలో అనేకహత్యలకు, గృహదహనాలకూ పేరుపడ్డ కృష్ణమోహన్ అనే కమ్యూనిస్టును విచారణ నిమిత్తం కోర్టుకు హాజరు పర్చారు. చేతులకు, కాళ్లకు సంకెళ్లు వేసి కృష్ణమోహన్‌ను బోనులో నుంచోపెట్టేరు.

మోహన్‌రావు ఖైదీకేసి చూశాడు. ఒక్కసారిగా అతని కళ్లు మూసుకుపోయి- కృష్ణమూర్తిని ఆ స్థితిలో బోనులో తను చూడాల్సివస్తుందని అనుకోలేదు. కొన్ని నిముషాలు గడిచినై. పోలీసు సర్కిల్ ఇనస్పెక్టరు కృష్ణమోహన్ చేసిన హత్యలు, దోపిడులు ఏకరువుపెట్టాడు. తనదగ్గర వున్న సాక్ష్యం వ్రాతపూర్వకంగా వున్న దాన్ని మోహనరావుఎదుట పెట్టాడ.

మోహనరావు తొట్రుపాటు లేకుండా పోలీసు ఉద్యోగి చెప్పేదంతా విన్నాడు. ఖైదీకేసి చూసి-

"నీ పై మోపబడ్డ ఈ నేరాలకు నీ వేమి చెపుతావు?" అని ధైర్యం చిక్కబట్టుకుని ప్రశ్నించాడు. వెంటనే కృష్ణమూర్తి—

"పోలీసులు చెప్పే నేరాలు నేను చేసినవే - ఇంకా అనేకములు కూడా చేశాను. ఆ చేయటంలో నేను నమ్మిన మార్గాలు నాకు ధైర్యం చేకూర్చినై. కోర్టువారు ఇష్టంవచ్చినట్లు చెయవచ్చు" అన్నాడు.

మోహనరావు తన రెండుకళ్ళతోనూ బాల్యస్నేహితుడైన కృష్ణమూర్తిని ఒకసారి సాభిప్రాయంగా ఎగాదిగా చూశాడు. మోహనరావు చూపులు కృష్ణమూర్తి చూపులలోకి చొచ్చుకుపోయినై.

వెంటనే మోహనరావు చెమర్చిన తన కండ్లను కళ్లద్దాలమాటున దాచుకున్నాడు. తల వంచుకుని వ్రాసిన "కృష్ణమూర్తిమరణ దండన" కోర్టులో అసహజమైన కంఠంతో వినిపించి కుర్చీమీదనుంచి దిగాడు.

సాయంత్రం గుండెబరువుతో ఇంటికి చేరిన మోహనరావుకు సుధా గోపాలరావులు ఇంట్లోనుంచి వెళ్లిపోవడం ఒక ఆఘాతంలా తగిలింది. ★